ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అంగరంగ వైభవంగా కనకమహాలక్ష్మి తీర్థం

ఎలమంచిలి పట్టణంలోని ధర్మవరంలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయడానికి భక్తులు చలిని కూడా లెక్కచేయకుండా తెల్లవారుజామునే ఆలయం వద్ద బారులు తీరారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఎలమంచిలి వీధులు జనసంద్రంగా మారాయి. ఆలయం వద్ద మూడు గ్రామాలకు చెందిన 108 మంది మహిళలు ఒకేసారి ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




ఆలయంలో పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు. తీర్థ మహోత్సవానికి హాజరైన భక్తులు

గోవాడను గాడిలో పెడతాం

షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవానికి కృషి

- ఎంపీ రమేశ్‌తోపాటు ఆర్థిక మంత్రి, ప్రత్యేక సీఎస్‌లను రేపు కలుస్తాం
- అనంతరం సీఎం దృష్టికి ఫ్యాక్టరీ సమస్యలు
- రైతులు, కార్మికులకు త్వరలో బకాయిలు చెల్లింపు
- ఆర్థిక పరిపుష్టికి డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు
- మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు, కేఎస్ఎన్ఎస్ రాజు
- రేపటి నుంచి రెగ్యులర్ క్రషింగ్: ఎండీ



గోవాడ ఫ్యాక్టరీలో ఎండీ, కార్మికులతో సమావేశమైన ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై అతిత్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవనున్నట్టు మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆదివారం ఉదయం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అతిథిగృహంలో ఎండీ వి.సన్యాసినాయుడు, కార్మిక సంఘం నేతలతో సమావేశం నిర్వహించి ఫ్యాక్టరీ స్థితిగతులపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, సహకార రంగంలో దిగ్విజయంగా నడిచిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా సమస్యల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఫ్యాక్టరీని తిరిగి గాడిలో పెట్టి, లాభాల బాటలోకి నడిపించడంతోపాటు చెరకు సాగు విస్తీర్ణం పెరిగేలా చూడడమే తమ ముందున్న లక్ష్యమన్నారు.

గోవాడ ఫ్యాక్టరీ మనుగడకు ఢోకా లేకుండా వుండడం కోసం డిస్టిలరీ లేదా లేక ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అంతకన్నా ముందు చెరకు రైతుల బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు చెల్లించడానికి చర్యలు చేపడతామన్నారు. ఫ్యాక్టరీకి రావాల్సిన బకాయిల గురించి పౌర సరఫరాలు, విద్యుత్ శాఖ, విశాఖ డెయిరీ అధికారులతో మాట్లాడామన్నారు. ఈ నిధులు వచ్చిన వెంటనే చెరకు రైతులకు రూ.3 కోట్లు చెల్లిస్తామన్నారు. కార్మికులకు సుమారు రూ.6 కోట్ల మేర బకాయిలు చెల్లించవలసి ఉందన్నారు. ఈ నెల 21న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు, ఆర్థిక మంత్రిని, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసి గోవాడ షుగర్స్‌కు నిధులు విడుదల చేయాలని కోరనున్నట్టు చెప్పారు. అనంతరం సీఎం చంద్రబాబును కలిసి గోవాడ స్థితిగతులను ... మిగతా 7వ పేజీలో


కొబ్బరి రైతుకు ధీమా

గొలుగొండ/ ఎస్.రాయవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులకు అండగా వుండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. ఈ ఏడాది నుంచి కొబ్బరి తోటలకు కూడా బీమా సదుపాయం కల్పించాయి. మొత్తం బీమా ప్రీమియంలో సగం సొమ్మును కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కొబ్బరి అభివృద్ధి బోర్డు, 25 శాతం సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. రైతులు 25 శాతం సొమ్ము చెల్లిస్తే చాలు. కొబ్బరి రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో పూర్తి సమాచారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది మార్చి చివరి వరకు గడువు వుంది.

జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ, మునగపాక, అనకాపల్లి, కశింకోట, నాతవరం, గొలుగొండ, తదితర మండలాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారుల గణాంకాల ప్రకారం సుమారు పది వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు వున్నాయి. వీటిల్లో 90 శాతం వరకు సముద్ర తీర మండలాల్లో వుండడంతో తుఫాన్లు సంభవించినప్పుడు పెనుగాలుల ధాటికి కొబ్బరి చెట్లు నేలవాలుతుంటాయి. కొబ్బరి తోటలకు బీమా పథకం వర్తించకపోవడంతో నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం పొందే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా సాయం చేస్తే తప్ప.. కొబ్బరి రైతులు కోలుకోలేరు. నేలవాలిన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటుకుని, సాధారణ కాపు స్థాయికి చేరుకోవాలంటే కనీసం ఆరేళ్లు పడుతుంది. అంతవరకు రైతులకు పెద్దగా ఆదాయం వుండదు. ఇటువంటి పరిస్థితిని అధిగమించడానికి కొబ్బరి తోటలకు కూడా బీమా సదుపాయం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. 'అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్' అనే కేంద్ర ప్రభుత్వ బీమా సంస్థ, కోకోనట్ డెవలప్‌మెంటు బోర్డు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం 'కోకోనట్ పామ్ ఇన్స్యూరెన్స్ స్కీమ్' (సీపీఐఎస్)ను అమలు చేస్తున్నది. రాష్ట్రంలో అనకాపల్లితోపాటు కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా జిల్లాల కొబ్బరి రైతులకు బీమా పథకం వర్తిస్తుంది.

తోటలను బీమా పథకంలో చేర్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- కనీసం ఐదు కొబ్బరి చెట్లు ఉంటే బీమాకు అర్హత
- గరిష్ఠ పరిమితి నిబంధన లేదు
- ప్రీమియం సొమ్ములో రైతులు 25 శాతం చెల్లిస్తే చాలు
- ఈ ఏడాది నుంచే అమలు
- మార్చి 31 వరకు గడువు





విధివిధానాలు

హైబ్రిడ్, టాల్, డ్వార్ఫ్ రకాల కొబ్బరి తోటలకు మాత్రమే బీమ పథకం వర్తిస్తుంది. హైబ్రిడ్, డ్వార్ఫ్ రకాలు అయితే నాలుగు నుంచి 60 ఏళ్ల వరకు, హైబ్రిడ్ రకం అయితే 7 నుంచి 60 సంవత్సరాల తోటలకు అమలు చేస్తారు. బీమా చేయాలంటే ఒకే పొలంలో కనీసం ఐదు కొబ్బరి చెట్లు వుండాలి. తుఫాన్లు, వడగండ్లు, ఈదురు గాలులు, భారీ వర్షాలు, వరదలు, చీడపీడలు, అగ్నిప్రమాదాలు, పిడుగులు, భూకంపాలు, కొండ చరియలు విరిగిపడడం, సునామీ, తీవ్ర దుర్భిక్షం వంటి కారణాల వల్ల కొబ్బరి తోటలకు నష్టం వాటిల్లితే సంబంధిత రైతులకు బీమా పరిహారం అందుతుంది. నాలుగు ... మిగతా 7వ పేజీలో

స్టాఫ్ నర్సు పోస్టులకు పైరవీలు

ప్రజాప్రతినిధుల సిఫారసులు

- ఇప్పటి వరకు 20 మంది లేఖలు తెచ్చినట్టు సమాచారం
- అధికారులకు నేరుగా ఫోన్లు చేయిస్తున్న అభ్యర్థులు
- తల పట్టుకుంటున్న ఆరోగ్య శాఖ యంత్రాంగం
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టుకు రేటు కట్టి బేరసారాలు
- మెరిట్ ప్రాతిపదికనే నియామకాలుంటాయన్న అధికారులు



ఆర్డీ కార్యాలయంలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ ప్రక్రియ అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. 106 పోస్టుల భర్తీకి 8,300 మంది దరఖాస్తు చేశారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పోస్టు దక్కించుకునేందుకు కొంతమంది అభ్యర్థులు పైరవీలకు తెరతీశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల సిఫారసు లేఖలతో అధికారులను కలుస్తున్నారు. మరికొందరు నేరుగా ప్రజాప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. ఇప్పటివరకు 20 మంది అభ్యర్థులు సిఫారసు లేఖలతో అధికారులను సంప్రదించగా, మరో పది మంది ఫోన్లు చేయించినట్టు తెలిసింది.

వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-1) పరిధి (ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం)లో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 17 వరకు సాగిన ప్రక్రియలో 8,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే, ఒక్కో పోస్టుకు 78 మంది మధ్య పోటీ నెలకొంది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో ఖాళీగా ఉన్న 72 పోస్టులను ... మిగతా 7వ పేజీలో

ఆర్టీసీ పార్శిల్‌కు ఆదరణ

గణనీయంగా పెరుగుతున్న బుకింగ్స్

నర్సీపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్శిల్ రవాణా సేవల ద్వారా ప్రజా రవాణా శాఖ (పీటీడీ)కి ఊహించని విధంగా ఆదాయం పెరుగుతున్నది. సేవలను మెరుగుపరుచుకుంటూ, పార్శిల్ బుకింగ్స్ పెంచుకుంటూ లక్ష్యాలను మించి ఫలితాలను సాధిస్తున్నది. జిల్లాలోని రెండు డిపో పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,26,26,498 ఆదాయం రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు తొమ్మిది నెలల్లోనే రూ.1,57,32,538 ఆదాయం వచ్చింది. ఇందులో రూ.97,36,546 అనకాపల్లి డిపో నుంచి, రూ.59,95,992 నర్సీపట్నం డిపో నుంచి వచ్చింది.

- రెండేళ్లలో రెట్టింపు అయిన ఆదాయం
- 2022లో ఏప్రిల్-డిసెంబరు రూ.77.5 లక్షలు..
- 2023లో రూ.99.5 లక్షలు, 2024లో రూ.1.57 కోట్లు
- పార్శిల్స్ బుకింగ్‌లోనూ పురోగతి
- సత్వర డెలివరీనే కారణమంటున్న అధికారులు



నర్సీపట్నంలో ఆర్టీసీ పార్శిల్ బుకింగ్, డెలివరీ కార్యాలయం

రెండేళ్లలో వంద శాతం పెరిగిన ఆదాయం

పార్శిల్ రవాణా సేవలు బాగుండడంతో ప్రజల నుంచి ఆదరణ పెరుగుతున్నది. దీంతో ఏటేటా ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతున్నది. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఆదాయం రెట్టింపు అయ్యింది. 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు పార్శిల్ రవాణా ద్వారా రూ.77.5 లక్షల ఆదాయం వచ్చింది. 2023లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.99.5 లక్షలు సాధించింది. 2024లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఏకంగా రూ.1,57,32,446 ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే రూ.58 లక్షలు పెరిగింది. మొత్తం మీద రెండేళ్లలోనే ఆదాయం వంద శాతం పెరిగింది. ఇక పార్శిల్ బుకింగ్స్ విషయంలోనూ మంచి పురోగతి సాధిస్తున్నది. 2023-24లో అనకాపల్లిలో పార్శిల్ బుకింగ్స్ 29,616 కాగా 2024-25లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 42,221 పార్శిల్స్ బుక్ అయ్యాయి. నర్సీపట్నంలో 2023-24లో 17,202 బుకింగ్స్ రాగా, 2024లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 24,734 పార్శిల్స్ బుక్ అయ్యాయి.

వేగంగా డెలివరీ

ప్రైవేటు పార్శిల్, కొరియర్ సంస్థల ద్వారా పార్శిల్స్ రావాలంటే రెండు రోజులు పడుతున్నది. అదే ... మిగతా 7వ పేజీలో

సెజ్ పైప్‌లైన్ లీకేజీ

- నెల రోజుల నుంచి తాగునీరు వృథా
- పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



పైపులైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు

పరవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్-సెజ్)కి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ ఎలమంచిలి- గాజువాక మార్గంలో పరవాడ వద్ద దెబ్బతిన్నది. ఇది జరిగి సుమారు నెల రోజులు అయినప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో నిత్యం తాగునీరు వృథాగాపోతున్నది. మండలంలోని తాడి గ్రామానికి సమీపంలో ఏలేరు కాలువ నుంచి ఏపీఐఐసీ పంప్‌హౌస్ నుంచి ఎస్ఈజడ్‌కు పైపులైన్ ద్వారా నీరు సరఫరా అవుతుంది. నెల రోజుల క్రితం స్థానిక రాజా హోటల్ సమీపంలో పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడింది. నీరుసరఫరా అయినంతసేపు పైప్‌లైన్ లీకవుతున్నది. నిత్యం ఈ మార్గంలో రాక పోకలు సాగించే ఏపీఐఐసీ అధికారులు, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైకుంఠ వాసునిగా ఉపమాక వెంకన్న

- ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు

నక్కపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామివారు ఆదివారం వైకుంఠ వాసునిగా విశిష్ట దర్శనమిచ్చారు. శేషతల్ప వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని వైకుంఠ వాసునిగా అర్చకులు అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం పరమపద ఉత్సవాన్ని, అనంతరం మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ ఉత్సవంతో ఈ ఏడాది ధనుర్మాసం, రాపత్తు అధ్యయనోత్సవాలు ముగిసినట్టు ఆలయ అర్చకులు ప్రకటించారు.



వైకుంఠ వాసునిగా దర్శనమిస్తున్న స్వామివారు



కోర్టులు, మీడియా సమన్వయంతో పనిచేయాలి

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్
- విశాఖలో సౌత్ జోన్-2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్ ... మెయిన్‌లో

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతిచెందిన గంగరాజు (ఫైల్)

మునగపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనకాపల్లి బైపాస్-అచ్యుతాపురం పూడిమడక రోడ్డు మార్గం గంగాదేవిపేట జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు ఎస్.ఐ ప్రసాదరావు తెలిపారు. గంగాదేవిపేట గ్రామానికి చెందిన బత్తిన గంగరాజు ఆదివారం సాయంత్రం మునగపాక వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా బైక్ బలంగా ఢీకొట్టడంతో మృతి చెందారని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడకి భార్య, కుమార్తె ఉన్నారు.

చూచుకొండలో ఏటీఎం చోరీకి యత్నం


ఏటీఎం వద్ద పోలీసు అధికారులు

మునగపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో చూచుకొండలో ఏటీఎంలో చోరీ యత్నం శనివారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చూచుకొండలో ఉన్న ఇండియా 1 ఏటీఎంలో చోరీయత్నానికి పాల్పడ్డారు. గ్యాస్ కట్టర్ ఉపయోగించి చోరీకి ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. ఏటీఎంలో నగదు భద్రంగా ఉందన్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం ఆనవాళ్లు సేకరించింది. ఘటన ప్రదేశాన్ని సీఐ ధనుంజయ, క్రైమ్ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

చోడపల్లి సర్పంచ్ జనసేనలో చేరిక


జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు నచ్చక ఆ పార్టీని వీడి నాయకులు, కార్యకర్తలు జనసేన, టీడీపీ పార్టీల్లో చేరుతున్నారని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని చోడపల్లి సర్పంచ్ గండిబోయిన బాను, ఆమె భర్త వెంకట్, వైస్ సర్పంచ్ గురునాథ్, వార్డు సభ్యులు రాజు, రమణ, నాగేశ్వరరావు, వెంకట్, వెంకటేశ్, నాగేశ్వరరావులతోపాటు 30 మంది జనసేనలోకి చేరారు. రాంబిల్లి మండలంలోని వెంకటాపురం పార్టీ కార్యాలయంలో వీరందరికి ఎమ్మెల్యే విజయకుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కరెడ్ల ప్రకాష్, మోటూరు శ్రీవేణి, ప్రవీణ్, పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు : మళ్ల


మాట్లాడుతున్న గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

మునగపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గవర కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. ఆదివారం మండలంలో వాడ్రాపల్లి పారిపల్లెమ్మ ఆలయం వద్ద జరిగిన మళ్ల కుటుంబీకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.బీసీ సంక్షేమానికి ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించిందని, దానిలో గవర కార్పొరేషన్‌కు కూడా కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు మళ్ల బెనర్జీని సత్కరించారు. సమావేశంలో మళ్ల వరహా నర్సింగరావు, కన్నుంనాయుడు, ఎంపీపీ మళ్ల జయమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు, మళ్ల నాయుడు పాల్గొన్నారు.

కనకమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

» కోలాహలంగా పట్టణ వీధులు » ఏకకాలంలో 108 మంది మహిళల కోలాటం... » అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ఆకట్టుకున్న ఏకకాలంలో 108 మంది మహిళల కోలాటం


జాతరకు వచ్చిన జనసందోహం


చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు భక్తజనం పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతమంతా కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త కొఠారు కుటుంబీకులు తొలిపూజ చేశారు. ఆదివారం రాత్రి జాతరను వీక్షించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎలమంచిలి పట్టణ వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పట్టణ ప్రధాన వీధులు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా అలంకరించారు. అలాగే భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేసారు. అమ్మవారి ఆలయం వద్ద ఏకకాలంలో 3 గ్రామాలకు చెందిన 108 మంది మహిళలచే కోలాటం నిర్వహించారు. భరతనాట్యం, కూచిపూడి, తాడిపెద్దు విన్యాసం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని సామాన్య భక్తులతోపాటు పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు. ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే యూవీ. రమణమూర్తి రాజు, ఎంపీపీ బోదెపు గోవింద్, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆడ్రెపు గుప్తా, పలువురు కౌన్సిలర్లు, కూటమి నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. వారందరినీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొఠారు సాంబ, ప్రతినిధులు మగుడుల సత్యనారాయణ, పిల్లా రాము, కొఠారు కొండబాబు, కొఠారు నరేష్, సూర్యప్రకాష్ తదితరులు ఆహ్వానించి, అమ్మవారి దర్శనం అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఎమ్మెల్యే సుందరపు అభినందించారు. జాతరకు వచ్చిన వేలాది మంది భక్తులకు కొఠారు నానాజీ కేటరింగ్ నిర్వాహకులు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 100 మంది పోలీసులు విధులు నిర్వర్తించారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పాయకరావుపేట: పాల్మన్‌పేట బీచ్‌లో సమావేశమైన పాల్తేరు పూర్వ విద్యార్థులు


కోటవురట్ల జూనియర్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


అచ్యుతాపురం రూరల్: కొండకర్ల ప్రైవేటు గెస్టుహౌస్‌లో కలిసిన హరిపాలెం పూర్వ విద్యార్థులు

పాయకరావుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్తేరు జడ్పీ హైస్కూల్‌లో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మండలంలోని పాల్మన్‌పేట బీచ్‌లో సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజేష్, శ్రీను, ప్రసాద్, గంగేశ్వరరావు, నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చందు, శ్రీను, శివప్రసాద్, సతీష్, భార్గవి, రాము, రామగిరీష్, రాణి, గిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010-2012 సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పదిలం గోవింద్, టి. బాలరాజు, జానకి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారు చేసిన అల్లరి, వాటికి గురువులు విధించిన క్రమశిక్షణ చర్యలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది ఆత్మీయంగా కలుసుకోవాలని వారంతా నిర్ణయించారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని కొండకర్లలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మండలంలోని హరిపాలెం హైస్కూల్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కొండకర్ల ప్రైవేటు గెస్టుహౌస్‌లో కలిశారు. సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే రాంబిల్లి మండలం లాలంకోడూరులో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కొండకర్ల ఆవ వద్ద కలిశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.

కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. సాయంత్రం వరకూ వివిధ ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. కొండకర్ల ఆవలో బోటు షికారు చేశారు. ప్రతీ ఏడాది కలుసుకుని.. సభ్యులలో ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయం అందించాలని, పలు సేవా కార్యక్రమాలను చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాండ్రేగుల మహేష్, ఆళ్ల శ్రీను, పారునాయుడు, బాలాజీ, కుమార్, పిళ్లా వెంకట్, పి.నాయుడు, రాజాన విజయ్, కాళ్ల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

స్థానిక హైస్కూల్‌లో ఆదివారం 1998-99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సందడి చేశారు.ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎవరు ఏఏ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారో అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటుకు కృషిచేసిన పూర్వ విద్యార్థులు రమణ, శ్రీను, గిరి, ప్రసాద్, సంతోష్ తదితరులను అభినందించారు.

మునగపాకలో..

మండలంలోని మూలపేట, పాటిపల్లి గ్రామాల్లో ఆదివారం మునగపాక జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. పాటిపల్లి అహోబిల లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద 2010-11 పదో తరగతి విద్యార్థులు, మూలపేట గంగాలమ్మ ఆలయం వద్ద 1990-91 బాచ్‌తోపాటు సీనియర్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వారంతా ఒకరి యోగ క్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కొందరు ఇతర పర్యాటక ప్రాంతాలకు వెళ్లారు.


రాంబిల్లి హైస్కూల్లో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు


మునగపాక : పాటిపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇంటర్వ్యూ..

రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం

పి.మోహనరావు, ఏవో, ఎలమంచిలి



(ఆంధ్రజ్యోతి/ ఎలమంచిలి)

ప్రశ్న: రైతులకు ఎలా సేవలు అందిస్తున్నారు?

జవాబు: రైతాంగానికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను శతశాతం అందిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల ద్వారా నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: పంటల్లో చీడపీడల నియంత్రణకు ఇటీవల నూతనంగా వచ్చిన యాప్‌ల పనితీరు..?

జవాబు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల్లో చీడపీడలను నియంత్రించేందుకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ యాప్‌ను ఉపయోగించి రైతు పొలాల్లో పంటలకు వ్యాపించే చీడపీడలను త్వరగా గుర్తించి, సత్వరం నియంత్రణకు చర్యలు తీసుకోవచ్చును.

ప్రశ్న: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు?

జవాబు: కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. రైతుల ఖాతాలకు నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం నూతన అధ్యక్షుడిగా సుందరపు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో జరిగిన రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలలో కార్యదర్శిగా పి.సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వరరావు, కె.చిన్నప్పరెడ్డి, కోశాధికారిగా కె.రుద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వి.మల్లేశ్వరరావు, కె.సుజాత ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా కె.రవిశేఖర్, ఎం.రాంకుమార్, డి.జితేంద్ర, ఎస్.శివశంకర్, కె.శ్రీనివాసరావు, పి.దిల్లేశ్వర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది రవి వ్యవహరించగా, పర్యవేక్షకులుగా భారత హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రతినిధి విష్ణు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, ద ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మోహన్ వెంకటరామ్ వ్యవహరించారు.

రఘువర్మ గెలుపు కోరుతూ ఏపీటీఎఫ్ ప్రచారం

ఎలమంచిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు ఉపాధ్యాయుల ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి సత్యనారాయణ, మల్లిపాటి సత్యనారాయణ, రాంబిల్లి మండల శాఖ కార్యదర్శి కె.అప్పాజీ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే.వీరభద్రరావు, వై.సత్యారావు, కే.నవీన్, బీ.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ బోల్తా

నక్కపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇసుక డిపో వద్ద ఆదివారం మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఎలమంచిలి నుంచి తుని వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఇసుక ర్యాంపు హైవే వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు వ్యాన్‌ను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

ఖాజీపాలెంలో కంటి వైద్య శిబిరం

అచ్యుతాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి వైద్యులు పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీలా తులసీరామ్, నాయకులు పీలా సందీప్, పీలా నాగశ్రీను, కోటి, సాయి, రమేష్, వరదరాజు, రాము, వంశీ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాలు

మునగపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమ పఠన మందిరం నెలకొల్పి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. 23న వ్యాసరచన, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు, 24న ముగ్గులు పోటీలు, 25న జాతీయ జెండా ఊరేగింపు, 26న నాటికల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణలో గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టెక్కలి పరశరాం, కమిటీ అధ్యక్షుడు దాడి సూర్యనారాయణ, కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహన్‌రావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, మారిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

కోటవురట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు కోటవురట్ల, మాకవరపాలెం మండలాలలోని అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు నర్సీపట్నం ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ పెట్ల నరేష్ తెలిపారు. ఈ శిబిరాలలో పశువులు, పెయ్యిలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. అనారోగ్యంగా ఉన్న ఎదకు రాని గర్భకోశ వ్యాధుల పశువులకు చికిత్సలు నిర్వహిస్తామన్నారు.

నేడు పెదకలవలాపల్లిలో కొత్తమ్మతల్లి తీర్థం

రాంబిల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకలవలాపల్లిలో సోమవారం కొత్తమ్మతల్లి తీర్థం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్‌లు కె.సన్నిబాబు, వై.దేముళ్లు, సర్పంచ్ వై. కనకారావు తెలిపారు. తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు.

ఘనంగా భరతమాత పూజ

ఎలమంచిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపాలెం, రుక్మిణిపురం గ్రామాల్లోని ఆలయాల్లో ఆదివారం భరతమాత పూజలను సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ జోన్ ధర్మప్రచారక్ ఆడారి గంగాధర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజాన సత్యనారాయణ, సభ్యులు సీహెచ్. అప్పలనాయుడు, పోతురాజు నాయుడు, గ్రామ కన్వీనర్లు సత్యనారాయణ, నాయుడు, ధార్మిక జట్టు సభ్యులు సతీష్, సాయి, లక్ష్మి, చిన్నమ్మలు పాల్గొన్నారు.

అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు : సీపీఎం

ఎస్.రాయవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెదగుమ్ములూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆకట్టుకున్న ప్రవచనం


వాసవీమాతను దర్శించుకుంటున్న స్వామిజీ

అనకాపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఏలూరుకు చెందిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ మార్యే స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. తొలుత ఆయన అమ్మవారిని దర్శించుకుని గోపూజ చేశారు. అనంతరం మానవుడు- మాధవుడు అనే అంశంపై చేసిన ప్రవచనం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కోరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం'


సమావేశంలో మాట్లాడుతున్న రాంకీ

కశింకోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేద్దామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ పిలుపునిచ్చారు. మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన క్లస్టర్-1 జనసేన సైనికులు ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చనడానికి ఉదాహరణ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అని పేర్కొన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. త్వరలోనే మండలంలో ఎమ్మెల్యే కార్యాలయం ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు అప్పికొండ గణేశ్, చదరం నాగేశ్వరరావు, కర్రి గోవింద, మంగా ఈశ్వర్‌లతో పాటు జనసైనికులు పాల్గొన్నారు.

రామాయణం గొప్పతనాన్ని తెలుసుకోవాలి


రామకోటి పుస్తకాలు అందజేస్తున్న సంఘం సభ్యులు

పరవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రామాయణం గొప్పతనాన్ని నేటి యువత తప్పనిసరిగా తెలుసుకోవాలని శ్రీరామకోటి సేవా సంఘం సభ్యుడు ఎం.బాబూరావు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పరవాడ రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామాయణంలో రాముడు మానవుడిగా జన్మించి మనిషి ఎలా జీవించాలో తెలియజేశారన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. రామకోటి పుస్తకాల విశిష్టతను వివరించారు. అనంతరం పిల్లలు, పెద్దలకు శ్రీరామకోటి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకోటి సేవా సంఘం సభ్యులు తిరుపతిరావు, వెంకటరావు, జె.రమేశ్, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు వి.సూరిబాబు, ఎం.రాజు, బి.అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపేటలో సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్


గ్రామస్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి గొల్లపేట పరిసర ప్రాంత కాలనీల్లో ఆదివారం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగు నిలిచిపోతుందని, ఈ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రణాళికలను రూపొందించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జీవీఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ సురేశ్, టీడీపీ నాయకులు యర్రా కోటేశ్వరరావు, రామారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతుకు ధీమా

... 5వ పేజీ తరువాయి

నుంచి 15 ఏళ్లలోపు చెట్లకు ఏటా రూ.900, అంతకుపైబడిన చెట్లకు రూ.1,750 బీమా వుంటుంది. బీమా ప్రీమియం వరుసగా రూ.9, రూ.14.5 వుంటుంది. ఇందులో 50 శాతం కొబ్బరి అభివృద్ధి బోర్డు, 25 శాతం సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. రైతులు 25 శాతం..అంటే రూ.2.25, రూ.3.5 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. రెండు సంవత్సరాలకు అయితే రూ.4.16, రూ.6.48, మూడేళ్లకు అయితే ఒక్కో చెట్టుకు రూ.5.9, రూ.91.9 చొప్పున చెల్లించాలి. కొబ్బరి తోటలకు బీమా చేసిన 30 రోజుల తరువాత నష్టం వాటిల్లితేనే పరిహారం అందుతుంది. నష్టం జరిగిన 15 రోజుల్లో రైతులు సంబంధిత బీమా కంపెనీకి సమాచారం అందించాలి. అన్ని పత్రాలు సమర్పించిన తరువాత నెల రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాకు పరిహారం సొమ్ము జమ అవుతుంది.

దరఖాస్తు ఎలా చేయాలంటే..

కొబ్బరి తోటలను బీమా చేయించే రైతులు సమీపంలోని ఉద్యాన శాఖ అధికారి నుంచి ప్రతిపాదన పత్రం తీసుకోవాలి. భూమి ధ్రువీకరణ పత్రం, ఆరోగ్యకరంగా ఉన్న చెట్లను మాత్రమే బీమా చేయిస్తున్నట్టు రైతు సెల్ఫ్ డిక్లరేషన్, ఆధార్ జెరాక్స్ పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్స్ కాపీలు అందజేయాలి. తోటలో కొబ్బరి చెట్లపై నంబర్లు వేయాలి. సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా ఉద్యాన శాఖ కార్యాలయానికి వెళ్లి, అక్కడ ఉండే సిబ్బంది సాయంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. బీమా ప్రీమియం సొమ్మును కూడా ఆన్‌లైన్‌లోనే (ఏఐసీ ఎన్‌వోపీసీ ఖాతా నంబరు 918020054765243, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూటీఐబీ 0000070) చెల్లించాలి. కొబ్బరి తోటలను బీమా చేయించుకోవడానికి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువుంది. కనీసం ఐదుకొబ్బరి చెట్లు వుండాలి. గరిష్ఠ పరిమితి లేదు.

చికెన్ ధరలు


బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ముగిసిన వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవం

- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆది దంపతుల విగ్రహం పురవీధుల్లో ఊరేగింపు


గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా ముగిసింది. శనివారం ఉదయం నుంచి ఆది వారం పొద్దుపోయే వరకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పురవీధుల్లో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబి డ్యాన్స్, బుర్రకథలు, ఆర్కెస్ట్రాలు వంటి వాటిని తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో మెయిన్‌రోడ్డు అంతా జనసందడిగా మారింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆలయంలోని గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు ఆధ్వర్యంలో సభ్యులు ఆయనను సత్కరించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎన్టీఆర్ స్టేడియంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. విద్యుత్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

'సమగ్ర భూ రీ సర్వేకు సహకరించండి'



కొండుపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తుమ్మపాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర భూముల రీ సర్వేకు యజమానులు సంపూర్ణ సహకారం అందించాలని అనకాపల్లి తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం కొండుపాలెంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. భూ రికార్డులు అవకతవకలకు తావులేకుండా ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూసర్వేకు సంబంధించి నియమించిన సెటిల్‌మెంట్ అధికారి పర్యవేక్షించనున్నారని చెప్పారు. మండలస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి భూ యజమానులకు న్యాయం చేకూర్చుతామని వివరించారు. పైలెట్ ప్రాజెక్టుగా కొండుపాలెం గ్రామాన్ని ఎన్నుకున్నామని, సోమవారం నుంచి పనులు ప్రారంభించనున్నామని చెప్పారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఐ రమేష్, సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


కోడిపందేలు ఆడుతూ పట్టుబడ్డ నిందితులు

కోడిపందాలు, గుల్లాట ఆడుతున్న నలుగురి అరెస్టు

కశింకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలం కొత్తూరు, తీడ గ్రామాల్లో కోడిపందేలు, గుల్లాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఆదివారం ముందస్తు సమాచారం మేరకు లాలం కొత్తూరులో కోడి పందేలాడుతున్న స్థావరంపై ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే, తీడ గ్రామంలో గుల్లాట ఆడుతున్న స్థావరంపై సిబ్బంది శనివారం రాత్రి దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. ఆరు గుళ్ళు, రూ.3210 నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు వివరించారు.


గుల్లాటలో పట్టుబడ్డ నిర్వాహకులు

స్టీల్ ప్లాంటుకు కేంద్రం ప్యాకేజీపై సంబరాలు


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

కొత్తూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో కూటమి నాయకులు ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రాంకీ, టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఆర్థిక సాయం ప్రకటించడం ఆనందదాయకమన్నారు. అనంతరం వారంతా స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పరవాడ డీఎస్పీగా విష్ణుస్వరూప్ బాధ్యతలు



పరవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పరవాడ నూతన డీఎస్పీగా వల్లెం విష్ణుస్వరూప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొబేషనరీ డీఎస్పీలకు ఇచ్చిన పోస్టింగుల్లో భాగంగా విష్ణుస్వరూప్‌కు తొలి పోస్టింగ్‌ను ఇక్కడ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2022 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అభ్యర్థి అయిన ఈయనది నెల్లూరు జిల్లా. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనారాయణను పోలీస్ హెడ్ క్వార్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు సైబర్ క్రైం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేస్తానని నూతన డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను సీఐలు, ఎస్‌ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమిత్‌షాకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా

అనకాపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా ఆదివారం నెహ్రూచౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో ఆయన అవమానకర వ్యాఖ్యలు చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ఆరోపించారు. కేంద్ర మంత్రి వర్గం నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి. ఉమామహేశ్వరరావు, డీడీ వరలక్ష్మి, కె. ఈశ్వరరావు, జి. నాయన బాబు, కె. తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవాడను గాడిలో పెడతాం

... 5వ పేజీ తరువాయి

వివరించి తగిన సహకారం కోరనున్నామన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, 2024-25 క్రషింగ్ సీజన్‌ను విజయవంతంగా నడిపించడం, నష్టాల్లో ఉన్న షుగర్ ఫ్యాక్టరీని లాభాట బాట పట్టించడం, ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకుని రావడం తమ ముందున్న లక్ష్యాలని చెప్పారు. షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవలసిన బాధ్యత తమ ప్రభుత్వంపై వుందన్న దానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. ఫ్యాక్టరీపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, యథావిధిగా చెరకు సరఫరా చేయాలని రైతులను కోరారు. ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి ఫ్యాక్టరీలో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఓవర్ హాలింగ్ పనులు పూర్తయ్యాయని, కార్మికులు కూడా విధుల్లో చేరినందున మంగళవారం నుంచి క్రషింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. కార్మికులకు రెండు, మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు, మరో కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు పాల్గొన్నారు.

'విద్యా శాఖ ప్రక్షాళనకు లోకేశ్ కృషి'


డైయిరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

కొత్తూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ అసందర్భ, అనాలోచిత నిర్ణయాల వల్ల అస్తవ్యస్తంగా మారిన విద్యాశాఖను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయడానికి విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ విశేష కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ముద్రించిన డైరీలు, క్యాలెండర్లు, స్టిక్కర్లు ఆదివారం అనకాపల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను మంత్రి లోకేశ్‌కు వివరించామన్నారు. వాటన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీను బాబు, రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

తుమ్మపాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి, కశింకోట మండలాల్లో సోమవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ బి.సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను వేస్తామని వివరించారు. అలాగే, గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు. రోజుకి రెండు గ్రామాలు చొప్పున ఈ నెల 31వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని వివరించారు. ఈ శిబిరాలను అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఘనంగా సీతారాముల తీర్థాలు


తాళ్లపాలెంలో విద్యుద్దీపాలంకరణలో ఆలయం


తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డులో...

సబ్బవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొటివాడ, జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరం గ్రామాల్లో సీతారాముల తీర్థాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా సత్యారావు, బొండా శేషుకుమారి, గ్రామాల పెద్దలు వడిసల రమేశ్, సాలాపు సూరిబాబు, మాటూరి పడమటయ్య, సాయి, అప్పారావు, దేముడు, గొర్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్ళపాలెంలో...

కశింకోట : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో సోమవారం సీతారాముల తీర్థం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే విద్యుద్దీపాలంకరణలో గ్రామంలోని వీధులు, తాళ్లపాలెం- నర్సీపట్నం ప్రధాన రోడ్డులో పెద్ద ఆర్చిలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


గాంధీనగరం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కశింకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థినుల డ్యాన్స్‌లు

అనకాపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీనగరం సంయుక్త హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. మున్సిపల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో 1962 నుంచి 1968 వరకు విద్యాభ్యాసం చేసిన 55 మంది ఒక్కసారిగా కలుసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో తెలంగాణలో ఉంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డిని తోటి మిత్రులు సన్మానించారు. డాక్టర్ ఎం.వెంకటఅప్పారావు ఆరోగ్య, ఆహార నియమాలను వివరించారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999- 200 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా కలుసుకున్నారు. రెండున్నర దశాబ్దాల అనంతరం కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. నాటి జ్ఞాపకాలను అంతా నెమరవేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

ఆర్టీసీ పార్శిల్‌కు ఆదరణ

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ ద్వారా అయితే దూరాన్నిబట్టి అదే రోజు లేదా 24 గంటల్లో పార్శిల్ డెలివరీ అవుతున్నది. హైదరాబాద్‌లో సాయంత్రం పార్శిల్ అందజేస్తే మరుసటి రోజు ఉదయానికి నర్సీపట్నంలో అందజేస్తున్నారు. దీంతో వివిధ రకాల హోల్ సేల్ వ్యాపారులు ఆర్టీసీ పార్శిల్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇటీవల పార్శిల్స్ డోర్ డెలివరీ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో నర్సీపట్నంలో రోజూ 20 నుంచి 30 పార్శిల్స్ డోర్ డెలివరీ ఇస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, తదితర ప్రాంతాల నుంచి నర్సీపట్నానికి రోజూ 280 నుంచి 300 వరకు పార్శిల్స్ ఉంటున్నాయని ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.గోవిందరావు చెప్పారు. నర్సీపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు 100 నుంచి 130 పార్శిల్స్ వెళుతున్నాయని పేర్కొన్నారు.

పలుచోట్ల బుకింగ్ ఏజెన్సీలు

పార్శిల్ సేవలను మరింత విస్తరించడానికి నర్సీపట్నం డిపో పరిధిలో పలుచోట్ల బుకింగ్ ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. నాతవరం మండలం తాండవ జంక్షన్, కొత్తకోట, రావికమతం, గొలుగొండ, కృష్ణాదేవిపేట, కొయ్యూరు, మాకవరపాలెంలో ఇప్పటికే పార్శిల్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో సీలేరు, మోతుగూడెంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. చదువుకున్న యువకులు ముందుకు వచ్చి బుకింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తే పార్శిల్స్, కొరియర్ సర్వీసుల చార్జీలపై 15 శాతం కమీషన్ ఇస్తున్నట్టు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.గోవిందరావు చెప్పారు.

స్టాఫ్ నర్సు పోస్టులకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా 34 పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ పి.రాధారాణి తెలిపారు.

నియామక ప్రక్రియ ఇలా...

దరఖాస్తు గడువు ముగియడంతో అధికారులు వడపోత ప్రారంభించారు. మెరిట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ వెల్లడించారు. మార్కులకు 75 శాతం, కరోనా, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసిన వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. ఈ నెల 26న నాటికి తుది జాబితాను సిద్ధం చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఈ నెల 29న తుది జాబితా ప్రదర్శిస్తామని, 30, 31 నాటికి నియామక పత్రాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి అధికారులపై ఒత్తిడి వస్తోంది. నగర పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఆరుగురు అభ్యర్థులకు సిఫారసు చేయగా, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ నేత ఇద్దరికి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత ఇద్దరికి సిఫారసు లేఖలు ఇచ్చారు. దీంతో అధికారులు తల పట్టుకుంటున్నారు.

రంగంలోకి దళారులు

ఆరోగ్యశాఖలో నియామక ప్రక్రియ ఎప్పుడు జరిగినా దళారులు రంగంలోకి దిగుతుంటారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అభ్యర్థుల నుంచి పోస్టుకు రేటు కట్టి వసూలు చేస్తుంటారు. తాజా నియామక ప్రక్రియలోనూ దళారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తొలుత కొంత మొత్తం చెల్లిస్తే చాలని, పోస్టు వచ్చిన తరువాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అభ్యర్థులను ఆశపెడుతున్నారు. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీ సూచించారు. ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వస్తే వారి వివరాలను తెలియజేయాలని ఆమె కోరారు. మెరిట్ ప్రాతిపదికనే ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో అపోహలు, అనుమానాలను తావులేదన్నారు. మెరిట్ జాబితాను విడుదల చేసిన తరువాత అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని నివృత్తి చేసిన తరువాత తుది జాబితాను వెల్లడిస్తామన్నారు.


కనీసం నడవడానికి వీలుగాలేని బట్టుమెట్ట రహదారి


కంపరేగుల వెళ్లే దారిలో శిథిలమైన వంతెన


శరభన్నపాలెం- బట్టుమెట్ట మధ్య రహదారికి అడ్డుగా కొండవాగు

బట్టుమెట్ట, కంపరేగుల గ్రామాలకు దారేది ?

- దశాబ్దాలుగా రహదారి నిర్మాణానికి నోచని వైనం
- రాకపోకలకు గిరిజనుల అవస్థలు

కొయ్యూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా శరభన్నపాలెం పంచాయతీలో చేరిన బట్టుమెట్ట, నడింపాలెం పంచాయతీ కంపరేగుల గ్రామాలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సుమారు 50 ఇళ్లలో 150 జనాభా కలిగిన బట్టుమెట్ట గ్రామం శరభన్నపాలెం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మార్గ మధ్యలోని శరభన్నపాలెం నుంచి కొండవాగు ప్రవాహం వరకు కనీసం గ్రావెల్ రోడ్డు కూడాలేదు. వాగుపై చిన్నపాటి కాజ్‌వే నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యారు. 1994లో అప్పటి చింతపల్లి ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు ఈ గ్రామాన్ని శరభన్నపాలెం సమీపంలోకి తరలించేందుకు ప్రయత్నించగా గ్రామాన్ని ఆనుకుని ఉన్న సాగు భూములు, జీడిమామిడి తోటలు, ఇళ్ల వదులుకుని వచ్చేందుకు అప్పట్లో గ్రామస్థులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. అనంతరం గతంలో టీడీపీ హయాంలో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. శరభన్నపాలెం నుంచి రహదారికి, కొండవాగుపై కాజ్‌వే నిర్మాణాలకు వీలుగా సుమారు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదు. దీంతో నేటికీ ఈ గ్రామానికి రహదారి సౌకర్యానికి నోచులేదు. వర్షాకాలం వస్తే ఈ గ్రామస్థులు గ్రామానికే పరిమితం కావాలి. నిత్యావసర సరకులు తీసుకోవాలన్నా గ్రామస్తులు శరభన్నపాలెం వచ్చి తీసుకోవాల్సిందే. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు, పాలకులకు గ్రామస్థులు పెట్టుకున్న అర్జీలు బుట్టదాఖలవుతున్నాయి.

కంపరేగులగూడెం వెళ్లాలంటే వాగు దాటాల్సిందే..

కంపరేగుల గ్రామం 32 ఇళ్లతో సుమారుగా 150 మంది జనాభా ఉంది. ఈ గ్రామం చేరుకోవాలంటే శరభన్నపాలెం నుంచి కొండవాగు దాటి సుమారు 3 కిలోమీటర్లు నడచి, లేదా బైక్‌పై ప్రయాణించాలి. వర్షాకాలంలో శరభన్నపాలెం అటు గాంకొండకు చేరాలంటే కొండ వాగు ప్రవాహాలు దాటేందుకు సాహసం చేయాలి. లేదా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిందే. 20 ఏళ్ల కిందట క్రితం శరభన్నపాలెం సమీప కొండవాగు ప్రవాహంపై పైపులతో చిన్నపాటి వంతెన నిర్మించటంతోపాటు గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేశారు. వంతెన రెండేళ్లకే కొండవాగు ప్రవాహ ఉధృతికి కొట్టుకు పోగా అప్పటిలో వేసిన గ్రావెల్ రోడ్డుకు కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో ఈ గ్రామస్తులకు రవాణా సౌకర్యం కొరవడింది. గ్రామం నుంచి అత్యవస సమయాలలో వైద్య సేవలకు తరలించాలన్నా వ్యయ ప్రయాసలతో కూడిన పనిగా మారింది. ఇప్పటికైనా అధికారు లు, పాలకులు స్పందించి రవాణా సౌకర్య కల్పనకు వీలుగా కొండవాగు ప్రవాహాల పై వంతెన నిర్మాణాలు చేపట్టి రహదారి మరమ్మతు చేయాలని ఆయా రెండు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.


అధ్వానంగా కంపరేగులకు రహదారి

జడ్పీ అతిథి గృహం మరమ్మతులకు చర్యలు

- యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఎంపీడీవో, చింతపల్లి.

ఇంటర్వ్యూ..


శ్రీనివాసరావు, ఎంపీడీవో, చింతపల్లి

సబ్ డివిజన్ కేంద్రమైన చింతపల్లిలో సందర్శకులు బస చేసేందుకు అనువుగా జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస్ తెలిపారు. పెసా ఎన్నికలు, గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ప్ర. జడ్పీ అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ. కొంత కాలంగా వినియోగంలోలేని ఈ గృహం సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు రూ.15లక్షల నిధులతో మరమ్మతులు, ఫర్నీచర్, అదనపు సదుపాయాలు కల్పించేందుకు జెడ్పీ సీఈవోకి ప్రతిపాదనలు పంపించాం. అతిథి గృహానికి అనుబంధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు అందజేసేందుకు ఎంపీ తనూజారాణి హామీ ఇచ్చారు.

ప్ర. పెసా గ్రామ సభలకు ఎన్నికలు జరిగాయి?

జ. మండలంలో 59 పీసా గ్రామ సభలు ఉన్నాయి. 44 గ్రామ సభల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికలు జరిగాయి. 15 గ్రామ సభలకు కోరంలేక ఎన్నికలు జరగలేదు. ఎన్నికల కోసం పంచాయతీరాజ్ శాఖ మలివిడత నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

ప్ర. పారిశుధ్యం మెరుగు పర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ. ప్రతి పంచాయతీలో ఇద్దరు క్లాప్ మిత్రలు, చింతపల్లి మేజర్ పంచాయతీలో 11మంది కార్మికులు ఉన్నారు. ప్రతి రోజు గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. వీధులు, పబ్లిక్ ప్రాంతాల్లో చెత్తను తొలగిస్తున్నారు. లంబసింగి, తాజంగి పంచాయతీలతోపాటూ చింతపల్లిలో ఐరన్ చెత్త బుట్టలను ఏర్పాటు చేశాం. ప్రజలు ఈబుట్టల్లోనే చెత్తవేయాలి.

ప్ర. సంపద కేంద్రాలు వినియోగంలో ఉన్నాయా?

జ. 17 పంచాయతీల్లో తాజంగి సంపద కేంద్రం ఐటీడీఏ ఇతర అవసరాలకు వినియోగిస్తుంది. బలపం, కుడుముసారిలో నిర్మాణ దశలో ఉన్నాయి. 14 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రథమంగా చింతపల్లి సంపద కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఫిబ్రవరి నాటికి 14కేంద్రాలు వినియోగంలోకి తీసుకొస్తాం.

- చింతపల్లి, ఆంధ్రజ్యోతి


తీర్థ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నేల డ్యాన్సులు


ఉత్సవ విగ్రహ ఊరేగింపు

వైభవంగా మోదకొండమ్మ తీర్థమహోత్సవం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ముగ్గుల పోటీలు

పాడేరురూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తీర్థమహోత్సవం ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కొల్లు కోటిబాబు నాయుడు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ లు చేపట్టారు. సాయంత్రం నేలడ్యాన్స్‌లు, తీన్‌మార్ బ్యాండ్, భారీ బాణ సంచా మధ్య ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తీర్థం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులను అందించారు. ఉత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక సీఐ డి.దీనబందు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, చీపురు రమాదేవి, సీహెచ్.సరస్వతీదేవి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వెయ్యాకుల సత్యనారాయణ, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటరమణ, కొణతాల సతీశ్‌కుమార్, సీహెచ్.రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, కె.దేముడు, కె.రాధాకృష్ణం నాయుడు లకే రత్నాబాయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో రద్దీ నెలకొంది.


ముగ్గుల పోటీ విజేత మేఘనకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పేదలకు చీరలు, రగ్గులు వితరణ


పంపిణీలో యూటీఎఫ్, స్నిగ్ధ ఫౌండేషన్ ప్రతినిధులు

డుంబ్రిగుడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ యూటీఎఫ్ నాయకుల సహకారంతో భీమునిపట్నం కలిగొట్ల స్నిగ్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గొందివలస గ్రామంలో పేద మహిళలు, వృద్ధులకు చీరలు, రగ్గులు,స్టీల్ బాక్సులు ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ చంద్రమూర్తి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఏటా జిల్లాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గిరిజనులు పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఫౌండేషన్ బృంద సభ్యుడు కె.ఎస్. మూర్తి, సభ్యులు కె. భానూజీ రావు, కె. శ్రీనివాసరావు, యూటీఎఫ్ సభ్యులు పైడిరాజు, వి. రాంబాబు, స్థానిక మండల అధ్యక్షుడు ఎస్ .బాలకృష్ణ , యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరావు, కార్యదర్శి కన్నయ్య, బాబూరావు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకుమారికి ఆదర్శ మహిళ అవార్డు

డుంబ్రిగుడ, జనవరి19 (ఆంధ్రజ్యోతి): శారద ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో బిర్లా మందిర్ ఆడిటోరియం, హైదరబాద్ నందు ఆదివారం సినినటీ కవిత, హైదరబాద్ మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా సౌత్ ఇండియా ఆదర్శ మహిళ అవార్డును మనవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిల అధ్యక్షురాలు కె. కృష్ణ కుమారి అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో సమాజ సేవ చేస్తున్న కృష్ణ కుమారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్య క్రమాలు చేపట్టాలని కోరారు.

3 నుంచి వాలీబాల్ టోర్నీ

పెదబయలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి సీకరి పంచాయతీ కేంద్రంలో మూడేళ్లకో జరిగే గంగా దేవత ఉత్సవాలను ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో నిర్వహించేందుందుకు ఉత్సవ కమిటీ సన్నాహాలు చేపడుతోంది. ఇందులో భాగంగా గ్రామంలో ఫిబ్రవరి 3 వతేదీ నుంచి డివిజన్ స్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు ఉత్సకమిటీ సభ్యులు తెలిపారు. అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందిన ఆసక్తి గల క్రీడాకారులు ముందుగానే బాలు ఫోన్: 7780328030, పాపారావు ఫోన్: 9493638502, ఫోన్: సూరిబాబు 9390360472లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పింఛన్ కోసం దివ్యాంగురాలి నిరీక్షణ


దివ్యాంగ వృద్ధురాలు రాధమ్మ

గూడెంకొత్తవీధి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగళ్లగొంది గ్రామానికి చెందిన గిరిజన దివ్యాంగ వృద్ధురాలు పింఛన్ కోసం ఎదురుచూస్తోంది. ఐదేళ్లగా పలుమార్లు అధికారులు, పాలకులకు అర్జీలు ఇచ్చినా ఫలితలేకపోవడంతో ఆమె తీ వ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సోదరుడు గృహంలో నివాసముంటున్న ఆమె తన దయనీయ పరిస్థితిని శనివారం వివరించారు. రాధమ్మ భర్త పదేళ్ల క్రితం భర్త చనిపోయారు. పిల్లలూలేరు. ప్రస్తుతం వృద్ధాప్యంలో సోదరుడు లక్ష్మణరావు ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు భోజన, వసతి కల్పిస్తున్నాడు. అయితే, ఆమె వ్యక్తిగత అవసరాలు, మందులకు రాధమ్మ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గిరిజనులకు 50ఏళ్లకే పింఛన్ అందజేయాలి. అయితే, అరవై ఏళ్ల రాధమ్మ గత ఐదేళ్లగా పింఛన్ కోసం నిరీక్షిస్తున్నా పాలకలు, అధికారులు కనీసం స్పందించడంలేదు. ఇకనైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి పింఛన్ ఇప్పించాలని ఆ వృద్ధురాలు వేడుకుంటున్నారు.

అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల పట్ల నిరసన



గారుమెట్ట గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

పాడేరురూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపకర్త బీఆర్.అంబేడ్కర్‌పై అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు ఎల్.సుందరరావు, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి అంబేడ్కర్‌ను రాజ్యసభలో ఎగతాళి చేస్తూ అమిత్ షా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఆయన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలు, ఆగ్రహావేశాలు పెల్లుబికినా ప్రధాని నరేంద్రమోదీ అతడిని వెనకేసుకురావడం దారుణమన్నారు. అమిత్‌షా ఎంపీ పదవికి రాజీనామాచేయాలని, మోదీ ఆయనను మంత్రి మండలి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ ఎం,సీపీఐ నాయకులు రమేష్‌బాబు, లక్ష్మణరావు, చంటిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సర్పంచ్ పరామర్శ


పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సర్పంచ్ పాండు

పెదబయలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి పాడేరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొరవంగి గ్రామస్థుడు పొయిబ సాంబ, పెదకోడపల్లి పంచాయతీ కోడపుట్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు బొండా మహేంద్ర, భరత్‌లను ఆదివారం దారెలా సర్పంచ్ పాంగి పాండు రంగ స్వామి పరామర్శించారు. ఈ నేపథ్యంలో గాయపడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట మహేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు. శనివారం సాయంత్రం బైక్ బోల్తా పడి గలగండ పంచాయితీ మంగబంద వద్ద జరిగిన ఈ ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


విజేతలకు ట్రోఫీ అందచేస్తున్న అతిథులు

కొయ్యూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని జనసేన అరకు పార్లమెంట్ కన్వీనర్ గంగులయ్య సూచించారు. కొండగోకిరి గ్రామంలో దివంగత నేత లోకుల గాంధీ స్మారక డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నీ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన క్రీడాకారులను, యువతను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా దివంగత నేత లోకుల గాంధీ జ్ఞాపకార్థం ఏటా వాలీబాల్ టోర్నీను నిర్వహించటం ఆనందదాయకమన్నారు. లోకుల గాంధీ గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం ఉన్నత ఉద్యోగాన్ని సైతం తృణప్రాయంగా వదులుకుని పాడేరు, అరకు నియోజకవర్గాలలో ప్రజలకు చేరువయ్యారన్నారు. ఆయనసేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం కార్యక్రమంకు హాజరైన టీడీపీ నేత, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు మాట్లాడుతూ యువతకు శారీరక, మానసిక ఉల్లాహానికి క్రీడలు దోహద పడతాయన్నారు. లోకుల గాంధీను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ వాలీబాల్ టోర్నీలో డివిజన్‌లో 40 జట్టు పాల్గొన్నాయి. విజేతలుగా రేఖపల్లి జట్టు ప్రథమ, నల్లగొండ జట్టు ద్వితీయ, బోయగూడెం జట్టు తృతీయ స్థానాలలో నిలిచాయి. విజేతలకు అతిథులు నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం అసెంబ్లీ కో కన్వీనర్ జగన్నాథం, గొలుగొండ ఎంఈవో ఒ. సత్యనారాయణ, గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, గోకిరి దత్తపుత్రుడు మురళీకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, మాడుగుల జనసేన అధ్యక్షుడు శ్రీను, గోకిరి సర్పంచ్ ముసిలి నాయుడు, కిరణ్ మాస్టర్, గోకిరి యువ సైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, తదితరులు

ముంచంగిపుట్టు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో ఆదిమ జాతి గిరిజనులకు ఇస్తున్న ఇళ్లకు రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఆదివారం ముంచంగిపుట్టు వచ్చిన ఆయన స్థానిక నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పీఎం జన్‌మన్ పథకంలో అందిస్తున్న ఇళ్లకు రూ. 2.39 లక్షలు మాత్రమే కేటాయిస్తున్నారని, గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో ఆసొమ్ముతో లబ్ధిదారులు ఇళ్లకు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై సానుకూలంగా స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాద్, నేతలు ఎం.నర్సింగరావుపడాల్, ఎం.ఎం.శ్రీను, ఎస్.రాసీరామ్‌దొర తదితరులు పాల్గొన్నారు.

బాలారం పాఠశాల ఆవరణలో బండరాళ్లు

- ప్రమాదాల బారిన విద్యార్థులు
- ఆట స్థలం లేక అవస్థలు


బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బండరాళ్లు

కొయ్యూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలో బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బండరాళ్ల ప్రమాదాలకు నిలయంగా మారాయి. విద్యార్థులకు వీటి వల్ల ఏ ప్రమాదం సంభవిస్తోందనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు కేటాయించిన సుమారు ఐదు ఎకరాలకు గానూ సుమారు మూడు వంతులు మేర బండరాళ్ల ఉండటంతో విద్యార్థులకు ఆట స్థలం కరువైంది. పాఠశాల ఏర్పాటు చేసి సుమారు 20 ఏళ్ల అవుతోంది. ఈ బండరాళ్లను తొలగించాలని పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లితండ్రులు ప్రజా ప్రతినిదులను, అధికారులకు పలు వినతులు ఇచ్చినా చర్యలు చేపట్టలేదు. దీంతో విధిలేక బండరాళ్ల మధ్యనే ఆట స్థలంగా వినియోగించుకుంటూ విద్యార్థులు ఇబ్బందిపాలవుతున్నారు. పలు సందర్భాలలో గాయాల పాలయ్యారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి బండరాళ్ల తొలగించి విద్యార్థులకు ఆటస్థలంగా మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

- డౌనూరులో అసంపూర్తి పైప్‌లైన్ పనులతో అవస్థలు


గొయ్యి చుట్టూ టార్పాలిన్ చుట్టి చేతులు దులుపుకున్న పంచాయతీ సిబ్బంది

కొయ్యూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డౌనూరులో తాగునీటి కొళాయి పైపులైన్ మరమ్మతులకు తీసిన గొయ్యిని తిరిగి పూడ్చకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సుమారు నెల రోజుల క్రితం గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కన తాగునీటిబోరు వద్ద రక్షిత పథకం పైపులైన్ మరమ్మతులకు పంచాయతీ సిబ్బంది గొయ్యిని తవ్వారు. మరమ్మతులు పూర్తయినా, గోతిని పూడ్చలేదు. దీని చుట్టూ కర్రలతో, ప్లాస్టిక్ టార్పాలిన్ చుట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో పైపులైన్ నుంచి లీకవుతున్న నీటితోపాటు పక్కనే గల బోరు వాడుక నీరు గోతిలో చేరి తిరిగి ప్రమాదకరంగా మారింది. చిన్నపిల్లలు, పశువులు ఈ గోతిలో పడితే జరగకూడని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇకనైనా గోతిని పూడ్చాలని తెలుగుదేశం పార్టీ నేత గోమంగి రామకృష్ణతోపాటు పలువురు కోరుతున్నారు.

చింతపల్లి ఇన్‌చార్జి ఏవోగా మధుసూదనరావు

చింతపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా మధుసూదనరావు నియమితులయ్యారు. స్థానిక ఏవో శ్రీనివాస్‌రావు రెండు నెలల పాటు శాఖపరమైన శిక్షణ కోసం విజయవాడ వెళ్లారు. దీంతో జీకేవీధి వ్యవసాయ అధికారి మధుసదనరావుకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

'ఉప్పరగూడెం సమస్యల పరిష్కారానికి కృషి'



సగర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నాతవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించి జీవో విడుదల చేశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. మండలంలోని ఏపీపురం పంచాయతీ శివారు ఉప్పరగూడెంలో ఆదివారం ఏర్పాటైన సగర్ల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. భగీరథ మహర్షి గుడి, ప్రహరీ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. అలాగే ఉప్పరగూడెం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త నక్క అచ్చియ్య కుటుంబానికి రూ.లక్ష 50వేలను తాను సొంతంగా ఇస్తానని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఉప్పరగూడెం ప్రజలు టీడీపీకి అండగా నిలుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి సమస్యలను స్పీకర్ అయ్యన్నపాత్రుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎం.జోగిబాబు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గుర్రం నూకరాజు, పారిశ్రామికవేత్త వెలగ వెంకట కృష్ణారావు సర్పంచ్ పైల రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రామచంద్ర, ఎంపీటీసీ లోక లోవరాజు, సగర్ల జిల్లా కార్యదర్శి నక్క రమణ పాల్గొన్నారు.

సామాజిక సేవ అందరి బాధ్యత : కౌన్సిలర్ రాజేశ్



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న రాజేశ్

కృష్ణాదేవిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో నూతనంగా ఏర్పాటు చేసిన తారక్ యువసేన ట్రస్టు ద్వారా ఆదివారం వృద్ధులకు భోజనం సమకూర్చారు. అనంతరం స్పీకర్ అయ్యన్న తనయుడు, నర్సీపట్నం మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, టీడీపీ నాయకులు చేతుల మీదుగా వృద్ధులకు పాలు, రెట్టెలు, పండ్లు ఎంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ సామాజిక సేవ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు గాడి అప్పలనాయుడు, శేఖర్, నాయుడు, తారక్ యువసేన ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గుండుపాలలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గొలుగొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండుపాలలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రెండవ విడతలో ఒక్కో పంచాయతీకి సుమారు రూ.పది లక్షల నుంచి ఇరవై లక్షల వరకు నిధులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో మంజూరయ్యాయి. దీంతో రావణాపల్లి, గుండుపాల, జోగంపేట, గ్రామాల్లో మట్టి రోడ్లను తీర్చిదిద్దేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గుండుపాలలో మాజీ ఎంపీ టీసీ కె.రవివర్మ, రావణాపల్లి మాజీ సర్పంచ్ కొల్లి సత్తిబాబు, టీడీపీ నాయకులు కొరుప్రోలు చంటి, చినబ్బాయి, గోవింద రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి పనులు పరుగు

- నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో శిథిలమైన కల్వర్టు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- స్పీకర్ అయ్యన్న చొరవతో నిధులు మంజూరు
- ఇప్పటికే ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు

నర్సీపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతలమయమైన ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రయాణం సులభతరం చేసిన విషయం తెలిసిందే. బలిఘట్టం, చింతపల్లి రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాలలోని గుంతలను యుద్ధప్రాతిపదిక పూడ్చారు. అదే విధంగా గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులోని రెండు పెద్ద కల్వర్టుల నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆయా పనులు కూడా మొదలు పెట్టారు. శివపురం డీఎఫ్‌వో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో



శివపురం వద్ద నిర్మాణం పూర్తయిన కల్వర్టు



నర్సీపట్నం- కృష్ణాదేవిపేట రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులు

శిథిలమైన కల్వర్టును రూ.12 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. ఒక మీటరు వెడల్పు ఖానా ఉన్న పైపులు రెండు వరుసలు అమర్చి 12 మీటర్ల వెడల్పుతో కల్వర్టు నిర్మాణం చేశారు. అలాగే స్పీకర్ అయ్యన్న ఇంటి సమీపంలో కల్వర్టు నిర్మాణానికి రూ.55 లక్షలు అంచనాలతో పనులు మొదలు పెట్టారు. ట్రాఫిక్ సమస్య లేకుండా మత్యామ్నాయ మార్గం ఏర్పాటుచేసి వాహనాలను దారి మళ్లించారు. ప్రస్తుతం శనవేగంగా పనులు జరుగుతున్నాయి. ఆరు మీటర్లు ఖానాతో పన్నెండు మీటర్లు వెడల్పుతో కల్వర్టు నిర్మిస్తున్నారు. మార్చి నెలాఖరుకు కల్వర్టు పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా రాములవారి తీర్థం

- పరిసర గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తజనం



ఏఎల్‌పురంలో తీర్థానికి హాజరైన భక్తజనం

కృష్ణాదేవిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏఎల్‌పురం గ్రామంలో రాములవారి తీర్థాన్ని ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. బంధువులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. తోడ పెద్దులను గ్రామంలో ఊరేగిస్తూ భక్తి గీతాలను పాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై. తారకేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అల్లూరి పార్కులో పూర్వ విద్యార్థులు కలయిక



అల్లూరి పార్కులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కృష్ణాదేవిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌లో 1973 నుంచి 1976 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఇక్కడి అల్లూరి పార్కులో కలుసుకున్నారు. నాలుగున్న దశాబ్దాల పైడి అంతా ఓచోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడుగా పోతల శ్రీరామమూర్తి, కార్యదర్శిగా చైతన్యబాబు, సభ్యులు ఎల్‌వీ రమణ, వబ్బలరెడ్డి శ్రీనివాసరావు, దలే వీరభద్రుడు, ఎం.రాంబాబు, పీవీ రమణ, రేముల నాగేశ్వరావుతో కలిసి పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. పలు సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు అంతా నిర్ణయించుకున్నారు. సహభోజనాల అనంతరం సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'

చోడవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా స్థానిక కొత్తూరు జంక్షన్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పార్టీ శ్రేణులు కర్రి రమణ, అతవ సురేశ్, మేరపురెడ్డి శ్రీను, ఖండేలా వెంకటరావు, అప్పన్న, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గోవాడను గాడిలో పెడతాం

... 5వ పేజీ తరువాయి

వివరించి తగిన సహకారం కోరనున్నామన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, 2024-25 క్రషింగ్ సీజన్‌ను విజయవంతంగా నడిపించడం, నష్టాల్లో ఉన్న షుగర్ ఫ్యాక్టరీని లాభాట బాట పట్టించడం, ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకుని రావడం తమ ముందున్న లక్ష్యాలని చెప్పారు. షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవలసిన బాధ్యత తమ ప్రభుత్వంపై వుందన్న దానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. ఫ్యాక్టరీపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, యథావిధిగా చెరకు సరఫరా చేయాలని రైతులను కోరారు. ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి ఫ్యాక్టరీలో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఓవర్ హాలింగ్ పనులు పూర్తయ్యాయని, కార్మికులు కూడా విధుల్లో చేరినందున మంగళవారం నుంచి క్రషింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. కార్మికులకు రెండు, మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు, మరో కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్‌కు ఆదరణ

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ ద్వారా అయితే దూరాన్నిబట్టి అదే రోజు లేదా 24 గంటల్లో పార్శిల్ డెలివరీ అవుతున్నది. హైదరాబాద్‌లో సాయంత్రం పార్శిల్ అందజేస్తే మరుసటి రోజు ఉదయానికి నర్సీపట్నంలో అందజేస్తున్నారు. దీంతో వివిధ రకాల హోల్‌సేల్ వ్యాపారులు ఆర్టీసీ పార్శిల్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇటీవల పార్శిల్స్ డోర్ డెలివరీ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో నర్సీపట్నంలో రోజూ 20 నుంచి 30 పార్శిల్స్ డోర్ డెలివరీ ఇస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, తదితర ప్రాంతాల నుంచి నర్సీపట్నానికి రోజూ 280 నుంచి 300 వరకు పార్శిల్స్ ఉంటున్నాయని ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.గోవిందరావు చెప్పారు. నర్సీపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు 100 నుంచి 130 పార్శిల్స్ వెళుతున్నాయని పేర్కొన్నారు.

పలుచోట్ల బుకింగ్ ఏజెన్సీలు

పార్శిల్ సేవలను మరింత విస్తరించడానికి నర్సీపట్నం డిపో పరిధిలో పలుచోట్ల బుకింగ్ ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. నాతవరం మండలం తాండవ జంక్షన్, కొత్తకోట, రావికమతం, గొలుగొండ, కృష్ణాదేవిపేట, కొయ్యూరు, మాకవరపాలెంలో ఇప్పటికే పార్శిల్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో సీలేరు, మోతుగూడెంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. చదువుకున్న యువకులు ముందుకు వచ్చి బుకింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తే పార్శిల్స్, కొరియర్ సర్వీసుల చార్జీలపై 15 శాతం కమీషన్ ఇస్తున్నట్టు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.గోవిందరావు చెప్పారు.

స్టాఫ్ నర్సు పోస్టులకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా 34 పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ పి.రాధారాణి తెలిపారు.

నియామక ప్రక్రియ ఇలా...

దరఖాస్తు గడువు ముగియడంతో అధికారులు వడపోత ప్రారంభించారు. మెరిట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ వెల్లడించారు. మార్కులకు 75 శాతం, కరోనా, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసిన వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. ఈ నెల 26న నాటికి తుది జాబితాను సిద్ధం చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఈ నెల 29న తుది జాబితా ప్రదర్శిస్తామని, 30, 31 నాటికి నియామక పత్రాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి అధికారులపై ఒత్తిడి వస్తోంది. నగర పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఆరుగురు అభ్యర్థులకు సిఫారసు చేయగా, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ నేత ఇద్దరికి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత ఇద్దరికి సిఫారసు లేఖలు ఇచ్చారు. దీంతో అధికారులు తల పట్టుకుంటున్నారు.

రంగంలోకి దళారులు

ఆరోగ్యశాఖలో నియామక ప్రక్రియ ఎప్పుడు జరిగినా దళారులు రంగంలోకి దిగుతుంటారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అభ్యర్థుల నుంచి పోస్టుకు రేటు కట్టి వసూలు చేస్తుంటారు. తాజా నియామక ప్రక్రియలోనూ దళారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తొలుత కొంత మొత్తం చెల్లిస్తే చాలని, పోస్టు వచ్చిన తరువాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అభ్యర్థులను ఆశపెడుతున్నారు. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీ సూచించారు. ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వస్తే వారి వివరాలను తెలియజేయాలని ఆమె కోరారు. మెరిట్ ప్రాతిపదికనే ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో అపోహలు, అనుమానాలను తావులేదన్నారు. మెరిట్ జాబితాను విడుదల చేసిన తరువాత అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని నివృత్తి చేసిన తరువాత తుది జాబితాను వెల్లడిస్తామన్నారు.

కొబ్బరి రైతుకు ధీమా

... 5వ పేజీ తరువాయి

నుంచి 15 ఏళ్లలోపు చెట్లకు ఏటా రూ.900, అంతకుపైబడిన చెట్లకు రూ.1,750 బీమా వుంటుంది. బీమా ప్రీమియం వరుసగా రూ.9, రూ.14.5 వుంటుంది. ఇం దులో 50 శాతం కొబ్బరి అభివృద్ధి బోర్డు, 25 శాతం సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. రైతులు 25 శాతం..అంటే రూ.2.25, రూ.3.5 చొప్పున చెల్లిస్తే సరి పోతుంది. రెండు సంవత్సరాలకు అయితే రూ.4.16, రూ.6.48, మూడేళ్లకు అయితే ఒక్కో చెట్టుకు రూ.5.9, రూ.91.9 చొప్పున చెల్లించాలి. కొబ్బరి తోటలకు బీమా చేసిన 30 రోజుల తరువాత నష్టం వాటిల్లితేనే పరిహారం అందుతుంది. నష్టం జరిగిన 15 రోజుల్లో రైతులు సంబంధిత బీమా కంపెనీకి సమాచారం అందించాలి. అన్ని పత్రాలు సమర్పించిన తరువాత నెల రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాకు పరిహారం సొమ్ము జమ అవుతుంది.

దరఖాస్తు ఎలా చేయాలంటే..

కొబ్బరి తోటలను బీమా చేయించే రైతులు సమీపంలోని ఉద్యాన శాఖ అధికారి నుంచి ప్రతిపాదన పత్రం తీసుకోవాలి. భూమి ధ్రువీకరణ పత్రం, ఆరోగ్యకరంగా ఉన్న చెట్లను మాత్రమే బీమా చేయిస్తున్నట్టు రైతు సెల్ఫ్ డిక్లరేషన్, ఆధార్ జెరా క్స్ పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్స్ కాపీలు అందజేయాలి. తోటలో కొబ్బరి చెట్లపై నంబర్లు వేయాలి. సమీపంలోని రైతు సేవా కేంద్రం లేదా ఉద్యాన శాఖ కార్యాలయానికి వెళ్లి, అక్కడ ఉండే సిబ్బంది సాయంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. బీమా ప్రీమియం సొమ్మును కూడా ఆన్‌లైన్‌లోనే (ఏఐసీ ఎన్‌వోపీసీ ఖాతా నంబరు 918020054765243, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూటీఐబీ 0000070) చెల్లించాలి. కొబ్బరి తోటలను బీమా చేయించుకోవడానికి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు గడువుంది. కనీసం ఐదుకొబ్బరి చెట్లు వుండాలి. గరిష్ఠ పరిమితి లేదు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి సమష్టి కృషి


- ఆర్యవైశ్య మహాసభ నాయకులు అంబికా కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న అంబికా కృష్ణ

చోడవరం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమమే లక్ష్యమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు అంబికా కృష్ణ, చిన్ని రామసత్యనారాయణలు అన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా వాసవీక్లబ్ మహాసభ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానిక ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీరు ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల ము త్యప్రసాద్, కర్నూలు జిల్లా టీడీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇల్లూరి లక్ష్మయ్యలు ఆర్యవైశ్యుల సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షులు ఎస్‌వీ మాధవ, నుదునూరు శ్రీనివాస్, టీఎస్‌గుప్తా, సంతోశ్‌కుమార్, శ్రీనాథు శ్రీనివాసరావు, గోపిశెట్టి నాగేశ్వరరావులతో కూడిన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడిగా కలగర్ల శేషు (చోడవరం) డాక్టర్ సీ ఎస్ కుమార్ (నర్సీపట్నం) నియమితులయ్యారు. వివిధ జిల్లాల ఆర్యవైశ్య నేతలు రావూరి రజని, దుండి రాజేశ్, మాటూరి రంగనాధ్, కారుమూరి మహేష్, పెంటబాబు, సభ్యులు పాల్గొన్నారు.


రోలుగుంట ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించండి



వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేత ఈశ్వరరావు

రోలుగుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు పచ్చిగొళ్ల ఈశ్వరరావు రాష్ట్ర ఆ రోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం గుడిలోవ శ్రీవిజ్ఞాన్ విహార పాఠశాలలో ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి వచ్చిన ఆయనను ఈశ్వరరావు కలిసి వినతిపత్రం అం దించారు. రోలుగుంట ఆస్ప త్రిలో ఎక్స్‌రే, ఇతర మౌలిక వసతులు లేవన్నారు. వీటికోసం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నంలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని వివరించారు.

జానకిరాంపురం పీఏసీఎస్‌లో అవినీతిపై చర్యలు ఏవీ?



మాట్లాడుతున్న సభ్యులు సాంబమూర్తినాయుడు, నారాయణరావు

రోలుగుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిన్నరగా జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకపై ఫిర్యాదులు చేస్తున్నా నేటికీ సంబంధింత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దా రుణమని సొసైటీ సభ్యులు కిల్లాడ సాంబమూర్తి, గొల్లు నారాయణరావు అన్నారు. అదివారం రోలుగుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొసైటీలో అవకతవకలపై సెక్షన్ 51 కింద విచారణ చేయాలని ఆ శాఖ డిప్యూటీ రిజిస్ట్రర్ ప్రేమ స్వరూపరాణి ఉత్తర్వులు జారీ చేసి 15 రోజులు దాటినా నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు.ఇలా తాత్సారం చేయడం వెనుక పీఏసీఎస్ సీఈఓ పాత్ర ఉందని ఆరోపించారు. సంఘంలో కాల పరిమితి అయి పోయిన రుణాలను రికార్డులను తారుమారు చేసి జప్తు నోటీసులను సంఘం సభ్యులకు పంపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రుణాలు తీసుకోకపోయినా రుణాలు తీసుకున్నట్లు జప్తు నోటీసులు పంపడం, బినామీల పేర్లపై రుణాలు పొందడం, కొంతమంది రైతులకు భూమి లేకున్నా తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలను వారి పేరిట వాడుకున్నారన్నారు. దీనిపై ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.





పీఎస్‌పేటమార్గంలో నిర్మాణ సామగ్రితో అస్తవ్యస్తంగా ఉన్న దృశ్యం..., కాలువలో మురుగు

నత్తనడకన పీఎస్‌పేట రోడ్డు పనులు

- రెండు నెలల కిందట నిర్మాణానికి శ్రీకారం
- పనుల్లో జాప్యంతో రాకపోకలకు అవస్థలు

చోడవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట వరకూ రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండడంపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. పీఎస్‌పేట రోడ్డు అధ్వానంగా మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఈనిర్మాణం పనులు ప్రారంభించింది. ఇప్పటికి రెండు నెలలుగా ఈ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. రోడ్డు వెంబడి కాలువ నిర్మాణం చేపట్టి, ఆ తరువాత సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు శ్రీకారం చుట్టారు. రెండు నెలలవుతున్నా ఇప్పటికీ కాలువల పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. రోడ్డుకు రెండు వైపులా తవ్వేసిన డెబ్రిస్‌తోపాటు నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ వదిలేయడంతో ఈ మార్గంలో వాహనాలు తిరగడానికి ఇబ్బందికరంగా మారింది. మరో వైపు కాలువలు తవ్వి వదిలేయడంతో మురుగునీరు నిలిచి స్థానిక వ్యాపారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలువల పనులు పూర్తయితే తప్పా సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టే అవకాశం లేదు. ఈ కాలువలు ఎప్పటికి పూర్తవుతాయో.. రోడ్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని స్థానికులతోపాటు, ఈ మార్గంలోని ఏటవతల గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ రోడ్డు కష్టాలు తీరుతున్నాయని సంబరపడిన వారు పనులు ముందుకు సాగకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు స్పందించి రోడ్డు త్వరితగతిన పూర్తి చేసి కష్టాలను తీర్చాలనిస్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ చోడవరం ఇన్‌చార్జి మృతి



మృతిచెందిన వెంకటరావు(ఫైల్)

చోడవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గూనూరు వెంకటరావు శనివారం రాత్రి మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్న ఆయన గతంలో చోడవరం సెగ్మెంట్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. గత నవంబరులో నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన వెంకటరావు ఆకస్మికంగా మృతి చెందడంపై ఆ పార్టీ నాయకులతో పాటు, స్థానికులు సంతాపం తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దేవరాపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలో ఎం.అలమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 పదో తరగతి చదివిన విద్యార్థులంతా రైవాడ జలాశయం సమీపంలో ఆదివారం గడిపారు. విద్యార్థి దశలో గత తీపి గుర్తులను నెమర వేసుకున్నారు.

నేడు చెట్టుపల్లిలో పశువైద్య శిబిరం

చీడికాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లిలో ఈనెల 20న ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక పశువైద్యాధికారి కెవిఎస్.రాఘవమ్మ తెలిపారు.ఉదయం 9గంటలకు ఈశిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారన్నారు.

54 మందికి నేత్ర వైద్య పరీక్షలు



చుక్కపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

చీడికాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చుక్కపల్లిలో ఆదివారం విశాఖ శంకర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నే త్ర వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో 54మందికి తనిఖీలు చేయగా ఆపరేషన్‌లకు 16మంది ఎంపికయ్యారు. మరో 30మందికి మందులందించారు. క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, స్థానిక నాయకులు మజ్జి దేవానందం పాల్గొన్నారు.

చౌడవాడలో...

కె.కోటపాడు: చౌడువాడలోని సతకంపట్టు రామాలయం వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 30 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈశిబి రంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, గ్రామ పెద్దలు సహకారమందించారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థమహోత్సవం



ఏనుగు, గుర్రాల విగ్రహాల ఊరేగింపు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కె.కోటపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ దేవత మరిడిమాంబ తల్లి తీర్థం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి గ్రామస్థులంతా పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బంధుమిత్రులతో ప్రతి ఇల్లూ కళకళలాడింది. సాయంత్రం ఇత్తడి గుర్రాలు, అంబారీ ఏనుగుతో బాణసంచా, డప్పు వా యిద్యాలతో గ్రామస్థులు ఆలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి రామాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.